క్లుప్తంగా

రేపు కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహావిష్కరణ



పరకాల : పట్టణంలోని ఆర్టీసీ డిపో క్రాస్ వద్ద ఏర్పాటు చేసిన తెలంగాణ గాంధీ, మాజీ మంత్రి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని ఈనెల 2న స్థానిక ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించనున్నట్లు విగ్రహావిష్కరణ కమిటీ చైర్మన్ డాక్టర్ పోతాని రాజేశ్వర్ ప్రసాద్ తెలిపారు. పట్టణంలోని లలిత నర్సింగ్ హోంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ తొలి, రెండో తరాల ఉద్యమకారుడిగా ప్రజలకు స్ఫూర్తినిచ్చారని కొనియాడారు. విగ్రహావిష్కరణకు ప్రజలు, పద్మశాలీ కులస్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో పద్మశాలీ సేవా సంఘం అధ్యక్షుడు బాసాని దయాకర్, ప్రధాన కార్యదర్శి రాజు, పోపా ప్రధాన కార్యదర్శి దుంపేటి నాగరాజు, పద్మశాలీ సేవా సంఘం నాయకులు మార్త భిక్షపతి, గాదె శంకరయ్య, రాచర్ల అశోక్, కోమాకుల రాజేందర్, కౌన్సిలర్ పొరండ్ల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



ఐనవోలు : ఐనవోలు శ్రీమల్లికార్జున స్వామి ఆలయంలో పారిశుద్ధ్య బాధ్యతలు నిర్వహించిన ఎండీ.లతీఫ్‌ను ఆలయ ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు, అర్చక సిబ్బంది స్వామి వారి ఫొటో అందించి శాలువా కప్పి శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడారు. సంక్రాంతి నుంచి ఉగాది వరకు జాతర బ్రహ్మోత్సవాల్లో భక్తులకు అసౌకర్యం కలుగకుండా పారిశుద్ధ్య పనులు సమర్థవంతంగా నిర్వహించారని లతీఫ్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఆలయ ఉపప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకుడు పాతర్లపాటి శ్రీనివాస్, అర్చకులు నందనం భానుప్రసాద్ శర్మ, నందనం మధు శర్మ, పాతర్లపాటి నరేష్ శర్మ, శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్లు కిరణ్‌కుమార్, మధుకర్, నారాయణరావు, తిరుమలేష్, సిబ్బంది పాల్గొన్నారు.

లోకాయుక్తలో ఫిర్యాదు



శాయంపేట : మండల కేంద్రంలోని శాయంపేట–మైలారం దారిలోని కనకదుర్గమ్మ ఆలయ భూమిని చుట్టుపక్కల రైతులు ఆక్రమించారంటూ లోకాయుక్తలో శుక్రవారం ఫిర్యాదు చేసినట్లు తెలంగాణ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా కార్యదర్శి వంగరి సాంబయ్య తెలిపారు. మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామ శివారులోని సర్వే నంబర్ 45/5లోని కనకదుర్గమ్మ ఆలయానికి సుమారు 600 ఏళ్లుగా భూమి ఉందన్నారు. ప్రభుత్వ భూమి గా రెవెన్యూ రికార్డుల్లో నమోదైనా కొందరు కబ్జా చేశారని చెప్పారు. ఈ విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. ఆలయానికి హద్దులు కేటాయించాలని కోరినట్లు వివరించారు.

చికిత్స పొందుతున్న మహిళా కూలీ మృతి

పరకాల/శాయంపేట : పరకాల చలివాగు వంతెన సమీపంలో మార్చి 29న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మహిళా కూలీ కొంగర లక్ష్మీ (48) వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. లక్ష్మీ మృతితో శాయంపేట మండలంలోని పత్తిపాక గ్రామంలో విషాదం నెలకొంది. ఆ ప్రమాదంలో ఇప్పటివరకు మృతి చెందిన వారి సంఖ్య మూడుకు చేరింది.

చికిత్స పొందుతున్న ఇద్దరు..

శాయంపేట : వేర్వేరు ఘటనల్లో ఆస్పతి పాలై చికిత్స పొందుతున్న ఇద్దరు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై వీరభద్రరావు కథనం ప్రకారం.. మండలంలోని సూరంపేట గ్రామానికి చెందిన అల్లెపు సాంబయ్యరెడ్డి (58), పెద్దకోడెపాక గ్రామానికి చెందిన కొయ్య నాగరాజు (40) ఈనెల 30న వారి ఇళ్లలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. వారిని వారి కుటుంబీకులు వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చేర్పగా చికిత్స పొందుతూ ఇద్దరూ శుక్రవారం మృతి చెందారు. కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వృద్ధుడికి గాయాలు



పరకాల : పట్టణం నుంచి హుజురాబాద్‌కు వెళ్లే దారిలో గురువారం రాత్రి రోడ్డు ప్రమాదం చోటు చేసుకొని గుర్తు తెలియని వృద్ధుడికి గాయాలయ్యాయి. పోలీసులు క్షతగాత్రుడిని వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. వృద్ధుడి వివరాలు ఎవరికైనా తెలిస్తే ఎస్సై శివకృష్ణనను సెల్ నంబర్ 9502655598లో లేదా తనను 8712685224లో సంప్రదించాలని సీఐ కిషన్ కోరారు.

అదానీ, అంబానీలకే మోదీ ప్రాధాన్యం

● ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

శాయంపేట : కార్పొరేట్ దిగ్గజాలైన అదానీ, అంబానీలకే ప్రధాని మోదీ ప్రాధాన్యమిస్తున్నారని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి విమర్శించారు. మండలంలోని ప్రగతిసింగారం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళన సమీక్షా సమావేశానికి ముఖ్యఅతిథులుగా జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి పాల్గొనగా ఎమ్మెల్యే మాట్లాడారు. శ్రేణులు సమన్వయంతో పార్టీ పతిష్టతకు పాటుపడాలని సూచించారు. సీఎం కేసీఆర్ అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ భారతదేశానికి ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి రాబోయే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు బాటలు వేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీ రామిశెట్టి లత లక్ష్మారెడ్డి, పరకాల ఏఎంసీ వైస్ చైర్మన్ మారపల్లి నందం, పార్టీ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే సంక్షేమ పథకాలు

బీఆర్ఎస్ అధికారంలో ఉండడం వల్లే పేదలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి తెలిపారు. మండలంలోని నేరేడుపల్లి, అప్పయ్యపల్లి, నూర్జాహాన్‌పల్లి, కాట్రపల్లి, రాజుపల్లి, సాధోనిపల్లి, ప్రగతిసింగారం గ్రామాల్లో పార్టీ జెండాలను శుక్రవారం ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. అనంతరం మండలంలోని పెద్దకోడెపాక గ్రామానికి చెందిన కొయ్యడ నాగరాజు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోగా అతడి మృతదేహానికి జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె వెంట ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి, సర్పంచ్‌లు తదితరులున్నారు.



జెండాను ఆవిష్కరిస్తున్న గండ్ర జ్యోతి

'కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు'



మాట్లాడుతున్న తూతిక ప్రకాశ్

ఎల్కతుర్తి : తెలంగాణ పట్ల వివక్ష పాటిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని తెలంగాణ ఉద్యమకారుడు, గ్రామీణ వైద్యుడు, అంతర్జాతీయ అవార్డు గ్రహీత తూతిక ప్రకాశ్ స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానలకు నిరసనగా ప్రకాశ్ ఈనెల 10న భద్రాచలం నుంచి హైదరాబాద్‌కు చేపట్టిన జన చైతన్య బైక్ యాత్ర మండల కేంద్రానికి శుక్రవారం చేరుకుంది. ఈ సందర్భంగా ప్రకాశ్‌కు స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ప్రకాశ్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధర పెంచి సామాన్య ప్రజల నడ్డివిరుస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై పక్షపాత ధోరణి అవలంబిస్తూ నిధుల కేటాయింపులో మోసపూరితంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతలపై అక్రమ కేసులు బనాయించడం దుర్మార్గమన్నారు. ఇప్పటివరకు 125 కిలోమీటర్ల యాత్ర కొనసాగిందని చెప్పారు. అనంతరం పార్టీ మండల అధ్యక్షుడు గొడిశాల సమ్మయ్యగౌడ్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వైఖరీ మార్చుకోకపోతే రాబోయే రోజుల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కడారి రాజు, నాయకులు గొల్లె మహేందర్, వెంకటేష్ యాదవ్, మునిగడుప శేషగిరి, గొడిశాల వినయ్‌గౌడ్, బొజ్జ శ్రీధర్, పైడిపెల్లి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా శ్రీరామచంద్రస్వామి పట్టాభిషేక మహోత్సవం



పరకాల : పట్టణంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో వ్యవస్థాపకులు చిట్టిరెడ్డి సమ్మక్క పుల్లారెడ్డి, చిట్టిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో శ్రీరామచంద్రస్వామి పట్టాభిషేక మహోత్సవాన్ని శుక్రవారం వేడుకగా నిర్వహించారు. మహోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు భారీగా హాజరయ్యారు. అనంతరం భక్తులకు మహాఅన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అందరికీ సమాన హక్కులు



కమలాపూర్ : ప్రజలందరికీ సమాన హక్కులు ఉంటాయని తహసీల్దార్ పాలెపాక రాణి చెప్పారు. మండలంలోని శనిగరంలోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో శుక్రవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాణి మాట్లాడారు. కులవివక్ష, బాల్యవివాహాల నిర్మూలన, ఇతర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ పింగిలి రవళి రంజిత్‌రెడ్డి, ఉపసర్పంచ్ మేకల తిరుపతి, గిర్దావర్ శ్రీనివాస్, అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు చెరిపెల్లి క్రిస్టఫర్, తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో మెరుగైన ఆరోగ్యం



పరకాల : మాట్లాడుతున్న కౌన్సిలర్లు



దామెర : సీమంతం నిర్వహిస్తున్న సిబ్బంది

పరకాల : చిరుధాన్యాలు తీసుకుంటే మెరుగైన ఆరోగ్యం లభిస్తుందని 2వ, 13వ, 14వ వార్డుల కౌన్సిలర్లు మడికొండ సంపత్, శనిగరపు రజని, మార్క ఉమాదేవి తెలిపారు. పోషణ పక్షంలో భాగంగా హరితనగర్ ప్రాథమిక పాఠశాలలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హేమలత అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన పోషణ పక్వాడా కార్యక్రమానికి కౌన్సిలర్లు హాజరై మాట్లాడారు. చిన్నారులకు రాగి జావ, చిరుధాన్యాలు అందించాలని సూచించారు. సరైన పోషక పదార్థాలు అందకపోవడం వల్లే చాలా మంది చిన్నారులు అనారోగ్యం పాలౌతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

దామెర : మండలంలోని సింగరాజుపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ కాగితాల శంకర్ మాట్లాడారు. చిరుధాన్యాల్లో పోషక విలువలు పుష్కలంగా ఉంటాయని తెలిపారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన, గర్భిణులకు సామూహిక శ్రీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జంగం రాణి, అంగన్‌వాడి సిబ్బంది ఇ.వాణి, ఎల్.సులోచన, వీఓ అధ్యక్షులు ఉప్పుల సుకన్య, జన్నత సంధ్య, ఆశా కార్యకర్తలు అంకమ రమ, నిరీక్షణ, ఉపాధ్యాయులు గిరిధరాచారి, మొగిలి, రామ్మూర్తి, కవిత పాల్గొన్నారు.

గడిపె వినయ్‌కి డాక్టరేట్



ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలంలోని కొప్పూర్ గ్రామానికి చెందిన గడిపె వినయ్‌కి ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ ఆగ్రానమి విభాగంలో డాక్టరేట్ పట్టా అందజేసింది. వినయ్ జగిత్యాలలోని పొలాసలో అగ్రికల్చర్ డిప్లొమా, ఖమ్మం జిల్లా అశ్వరావుపేటలో బీఎస్సీ అగ్రికల్చర్ పూర్తి చేశాడు, అనంతరం జగిత్యాల పొలాసలో అగ్రానమి సబ్జెక్టుల్లో పీజీ చేశాడు. తర్వాత ఏఈఓగా ఏడాది ఉద్యోగం చేసి రాజీనామా చేసి పీహెచ్‌డీకి దరఖాస్తు చేశాడు. రాష్ట్రంలో డిప్లొమా నుంచి అగ్రికల్చర్‌లో పీహెచ్‌డీ చదివిన ఏకైక వ్యక్తిగా రికార్డు సాధించాడు.

టెన్త్ విద్యార్థులకు ఆత్మీయ వీడ్కోలు



దామెర : జెడ్పీటీసీని సన్మానిస్తున్న విద్యార్థులు



ధర్మసాగర్ : ప్యాడ్‌లు పంపిణీ చేస్తున్న బొజ్జ రాజు

దామెర : మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు జూనియర్లు శుక్రవారం ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో జెడ్పీటీసీ గరిగె కల్పన కృష్ణమూర్తి మాట్లాడారు. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలని సూచించారు. ఆందోళనకు గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. ఎంపీపీ శంకర్, తహసీల్దార్ రియాజుద్దీన్, సర్పంచ్ గురిజాల శ్రీరాంరెడ్డి, ఎంపీటీసీ పోలం కృపాకర్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు పోలసాని శ్రీనివాస్‌రెడ్డి, హింగె బాబురావు, ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం అతిథులను విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ గోగెల సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మల్లికుదుర్లలో..

ధర్మసాగర్ (వేలేరు): మండలంలోని మల్లికుదుర్ల గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం దుర్గాభవానీ అధ్యక్షతన టెన్త్ విద్యార్థులకు జూనియర్లు ఆత్మీయ వీడ్కోలు నిర్వహించారు. టెన్త్ విద్యార్థులకు మల్లికార్జున ఫర్టిలైజర్ యజమాని బొజ్జ రాజు, మల్లికార్జున్ సొంత ఖర్చులతో పరీక్ష సామాగ్రి పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చాడ సరిత, సర్పంచ్ గోదల రాజిరెడ్డి, ఎంపీటీసీ బాల్నె వెంకటేశ్వర్లు, ఉపసర్పంచ్ గోవింద సురేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

శాయంపేట : మండల కేంద్రానికి చెందిన చేనేత కార్మికుడు బాసాని సమ్మయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ఉపసర్పంచ్ దైనంపల్లి సుమన్ శుక్రవారం పరామర్శించారు. అనంతరం 50 కేజీల బియ్యం అందించారు. కార్యక్రమంలో మారపల్లి మోహన్, దైనంపల్లి పాపయ్య, కరణ్‌బాబు, రాజు, బత్తుల కార్తీక్ పాల్గొన్నారు.

పట్టపగలే చోరీ

ఎల్కతుర్తి : మండలంలోని వీరనారాయణపూర్‌లోని ఓ ఇంట్లో శుక్రవారం పట్టపగలే చోరీ జరిగింది. ఎస్సై జక్కుల పరమేష్ కథనం ప్రకారం.. వీరనారాయణపూర్‌కు చెందిన మండ చంద్రమౌళి ఉదయం పొలం వద్దకు వెళ్లి మధ్యాహ్నం వచ్చే సరికి ఇంటి తాలం తీసి ఉంది. లోనికి వెళ్లి చూడగా లాకర్‌లోని 15 తులాల వెండి పట్టా గొలుసులు, గ్రాము బంగారు ఉంగరం, 2.5 గ్రాముల వంక ఉంగరం చోరీకి గురైనట్లు తెలిపారు. చోరీకి గురైన సొత్తు విలువ రూ.17 వేలు ఉంటుందని ఎస్సై చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పాఠశాలకు 'బెస్ట్ రన్నర్' వితరణ



దాతలను సన్మానిస్తున్న చైర్‌పర్సన్, ఉపాధ్యాయులు

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్‌కు 'బెస్ట్ రన్నర్' స్వచ్ఛంద సంస్థ సభ్యులు శుక్రవారం రూ.1.10 లక్షల విలువైన కంప్యూటర్లు, ఎల్సీడీ టీవీ, ట్యాబ్ మెటీరియల్, స్కానర్ కం ప్రింటర్, గ్రంథాలయ పుస్తకాలను ప్రధానోపాధ్యాయుడికి అందజేశారు. ఈ సందర్భంగా వారిని జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, ఉపాధ్యాయులు సన్మానించారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు, ఎన్నారైలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ అబ్బు ప్రకాశ్‌రెడ్డి, స్వచ్ఛంద సంస్థ సభ్యులు ముక్క శ్రీనివాస్, రమేష్, వీరేశలింగం, జ్ఞానేశ్వర్, రాజిరెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కోతుల బెడద నివారణ చర్యలు

పరకాల : పట్టణంలో కోతుల బెడద నివారణకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. కోతులను పట్టే వారిని మున్సిపల్ అధికారులు శుక్రవారం పిలిపించి సుమారు 100కుపైగా కోతులను బోనులో బంధించారు. వాటిని ప్రత్యేక వాహనంలో ములుగు జిల్లాలోని మేడారం శివారులోని అటవీ ప్రాంతానికి తరలించారు.

బీమా కల్పించాలి

ఆత్మకూరు : రైతులకు సహజ మరణానికి కూడా బీమా కల్పించాలని ఆత్మకూరు పీఏసీఎస్ చైర్మన్ ఏరుకొండ రవీందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావును శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం రవీందర్ గౌడ్ మాట్లాడారు. ప్రస్తుతం ప్రమాదవశాత్తు మరణిస్తే మాత్రమే బీమా వస్తుందన్నారు.

నైతిక విలువలు పెంపొందించుకోవాలి



ఐనవోలు : విద్యార్థులు నైతిక విలువలు పెంపొందించుకోవాలని స్వచ్ఛంద సామాజిక సేవా కార్యకర్త బంకా మాణిక్యరావు ఆకాంక్షించారు. మండలంలోని నందనం గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం బంగారు బాబు అధ్యక్షతన నిర్వహించిన సెమినార్‌లో మాణిక్యరావు మాట్లాడారు. విద్యార్థి దశలోనే తల్లిదండ్రులు, గురువులను గౌరవించడాన్ని అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఏపీజే కలాం, డాక్టర్ బీఆర్.అంబేడ్కర్, మహాత్మ గాంధీ, సర్దార్ వల్లభాయ్ పటేల్, నేతాజీ సుభాష్ చంద్రబోస్ లాంటి మహనీయుల జీవితాలను అధ్యయనం చేయాలని సూచించారు.

పేదలను ఆదుకునేలా సీఎంఆర్ఎఫ్

● వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్



ఎంపీటీసీ అనూషకు ఎల్ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే

ఐనవోలు : పేదలను ఆదుకునేలా సీఎంఆర్ఎఫ్ ఉపయోగపడుతుందని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ తెలిపారు. ఎంపీటీసీ దామెర అనూష తండ్రి, మండలంలోని కక్కిరాలపల్లి గ్రామానికి చెందిన కాగ నాగయ్యకు రూ.1.5 లక్షల, ఒంటిమామిడిపల్లి గ్రామానికి చెందిన పెండ్లి జెన్నయ్యకు రూ.లక్ష విలువైన లెటర్ ఆఫ్ కాన్సెంట్ (ఎల్ఓసీ)లు మంజూరు కాగా వాటిని వారి కుటుంబీకులకు హనుమకొండలోని తన నివాసంలో రమేష్ శుక్రవారం అందజేసి మాట్లాడారు. ఆరోగ్యశ్రీలో వర్తించని వ్యాధులకు, ప్రాణాపాయ స్థితిలో ఉన్న పేదలు కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకుంటే సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం అందించి ఆదుకుంటున్నట్లు తెలిపారు. పేదల ఆరోగ్య పరిరక్షణ, ఆర్థిక తోడ్పాటుకు ప్రభుత్వం చొరవ తీసుకుంటోందని చెప్పారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు పోలెపల్లి శంకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బుర్ర రాజశేఖర్, సర్పంచ్ కంజర్ల రమేష్, ఎంపీటీసీలు అనూష, కడుదూరి రాజు, తాటికాయల రమేష్, రాఘవులు, గ్రామ పార్టీ అధ్యక్షులు యాకయ్య, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

'పునర్విభజన' అమలులో పాలకులు విఫలం

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు



శాయంపేట : మాట్లాడుతున్న శ్రీనివాసరావు

శాయంపేట : సీపీఐ ప్రజాపోరు యాత్ర మండలంలోని మాందారిపేటకు చేరుకోగా ఆ పార్టీ నాయకులు బత్తిని సదానందం, అనుకారి అశోక్, అరికిళ్ల దేవయ్య, మారపల్లి క్రాంతికుమార్‌తోపాటు గుడిసెవాసులు స్వాగతం పలికారు. అనంతరం శాయంపేటలోని అంబేడ్కర్ కూడలి వరకు యాత్ర కొనసాగింది. అంబేడ్కర్, అనుకారి దామోదర్ స్తూపాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడారు. ఏపీ పునర్విభజన చట్టం అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. ఈనెల 4న యాత్ర ముగింపు సందర్భంగా హనుమకొండలో తలపెట్టిన సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు విజయసారథిరెడ్డి, భిక్షపతి, రాజ్‌కుమార్, జ్యోతి, స్టాలిన్, సదాలక్ష్మీ, మంజుల, రమేష్ పాల్గొన్నారు.

దామెర : సీపీఐ ప్రజాపోరు యాత్ర మండల కేంద్రానికి చేరుకోగా శ్రీనివాసరావు మాట్లాడారు. రాష్ట్ర విభజన సమయంలో బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామని కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదన్నారు. తొలుత మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. బతుకమ్మలు, కోలాట నృత్యాలు, డప్పు కళాకారుల ప్రదర్శనలు, ప్రజానాట్య మండలి సభ్యుల పాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో ఆ పార్టీ హనుమకొండ, భూపాలపల్లి, ములుగు జిల్లాల కార్యదర్శులు కర్రె భిక్షపతి, కొరిమి రాజ్‌కుమార్, తోట మల్లికార్జున్, సహాయ కార్యదర్శులు షేక్ బాషుమియా, మద్దెల మల్లేష్, జిల్లా నాయకులు తోట భిక్షపతి, అంబి సాంబయ్య, కండె నర్సయ్య, రాజేష్, రాధిక, సంపత్, ఐలయ్య, దేవేందర్, మంజుల పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే కేసీఆర్ ధ్యేయం



మాట్లాడుతున్న చైర్మన్ బొల్లు రాజు

దామెర : రైతుల సంక్షేమమే సీఎం కేసీఆర్ ధ్యేయమని పెద్దాపూర్ (ఊరుగొండ) ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) చైర్మన్ బొల్లు రాజు తెలిపారు. మండలంలోని ఊరుగొండలో శుక్రవారం నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో 2022–23 ప్రగతి నివేదిక చదివి వినిపించారు. ఈ సందర్భంగా చైర్మన్ రాజు మాట్లాడారు. 641 మంది రైతులకు సంబంధించిన 5 కోట్ల 58 లక్షల 79 వేల 246 రూపాయల రుణాలను రెన్యూవల్ చేశామని, 2 లక్షల 40 వేల రూపాయల వడ్డీ వసూలు చేశామన్నారు. కొత్తగా 180 మందికి రూ.1.20 కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు వివరించారు. సబ్సిడీ విత్తనాలు, ఎరువులు రైతులకు పరఫరా చేసినట్లు చెప్పారు. ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి చొరవతో సొసైటీలో రైతులకు భారీగా రుణాలు ఇచ్చినట్లు తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్ అంబటి రాజస్వామి, సీఈఓ శ్రీనివాస్, డైరెక్టర్లు, అనిల్, చంద్రమోహన్, మధూకర్, రాజు, శ్రీనివాస్, సంతోష్, స్వామి, బాబు, రాజు, రతన్ పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిర్మూలన బాధ్యత



మాట్లాడుతున్న బెజ్జంకి ప్రభాకర్

ధర్మసాగర్ (వేలేరు) : బాల్యవివాహాల నిర్మూలనను సామాజిక బాధ్యతగా చైల్డ్‌లైన్ జిల్లా టీం సభ్యుడు బెజ్జంకి ప్రభాకర్ అభివర్ణించారు. మండలంలోని గొల్లకిష్టంపల్లిలోని కేజీబీవీలో ×బాల్యవివాహాల నిర్మూలన÷పై శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. 18 ఏళ్లు నిండకుండా బాలికలకు, 21 ఏళ్లు నిండకుండా బాలురకు వివాహం చేయడం చట్టరీత్యా నేరమని చెప్పారు. పిల్లలను చదివించి ప్రయోజకులుగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. అనంతరం కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ కె.స్రవంతి మాట్లాడారు. మైనర్లకు ఎలాంటి సమస్యలు ఎదురైనా చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098కు ఫోన్ చేసి సాయం పొందవచ్చని చెప్పారు. అనంతరం బాలల సమస్యలకు సంబంధించి అవగాహన కల్పించేలా రూపొందించిన కరపత్రాలను విద్యార్థినులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ కె.సందీప్, సీఆర్టీలు సునీత, ఊర్మిళ, స్వరూప, కిరణ్మయి, యశోద పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ



పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేస్తున్న సౌజన్య శ్యామ్

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు మాజీ వార్డు సభ్యురాలు సౌజన్య శ్యామ్ శుక్రవారం పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వార్షిక పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించి తల్లిదండ్రుల, పాఠశాల కీర్తిప్రతిష్టలు ఇనుమడింపజేయాలని కోరారు. ఇష్టపడి చదివి 10 జీపీఏ సాధించాలని చెప్పారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్ మాట్లాడారు. పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేయడం పట్ల సౌజన్య శ్యామ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, మురళీధర్, ఎల్లయ్య, శ్రీనివాస్ రెడ్డి, సుధారాణి, సుకన్య, పద్మ రాజేశ్వరీ, దుర్గయ్య, ఉమ, స్టాలిన్, రాజమౌళి పాల్గొన్నారు.

'సర్పంచ్, అధికారులపై చర్యలు తీసుకోవాలి'

ఐనవోలు : ఈనెల 30న సీతారాముల కల్యాణం సందర్భంగా శ్రీరాముని విగ్రహానికి గులాబీ కండువా చుట్టిన సర్పంచ్ బోయినపల్లి శ్రీనివాసరావుపై, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సమ్మెట మహేందర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు ఇటీవల నందనం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో నిబంధనలకు విరుద్ధంగా సమావేశం నిర్వహించారని చెప్పారు. జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారులు విచారణ చేసి సర్పంచ్‌ను పదవి నుంచి తొలగించాలని కోరారు. ఆయన వెంట కూస చిరంజీవిరెడ్డి ఉన్నారు.